# తోలుబొమ్మలు

ఊరికి తూర్పుదిక్కుగా ఒక కొసనవున్నది పెద్దపాక. ఆ పాకనానుకుని ప్రారంభమైన చేలు ఆ చివర్న ఆకాశందాకా పరుచుకొని వుంటాయి. పచ్చగా, కళ్ళనిండుగా, ప్రాణంతో నవనవలాడుతూ. ఆ చేలను చీల్చుకుంటూ పారే 'మలిదేవి' వేసిన ఇసుకమేటలు బంగారుగుట్టల్లా మధ్యనుండి పాకిపోతవి. అందానికి జీవానికి మూలమైన ప్రకృతికి నడిబొడ్డు అన్పించే చోటు అది.

శంకరరామిరెడ్డిగారు పశువుల్ని కట్టేసుకోవడానికని వేయించిన ఆ పాక ఇప్పుడు వూరికే ఖాళీగా వుంటున్నది. సత్సంగంలో ఊరటపొందే నలుగురూ తీరిక చిక్కినప్పుడు ఉదయం సాయంకాలాల్లో చల్లటిప్రొద్దున అక్కడికి చేరుతారు. ముందుగా ఆ చోటు చేరినవాడు రామయ్య. తర్వాత ఒక్కరొక్కరుగా వచ్చి చేరారు. క్రమంతప్పకుండా రోజూవచ్చేవాళ్ళు రామయ్య, నరసింహశాస్త్రిగారు, శంకరరామిరెడ్డిగారూనూ తీరికవున్న రోజుల్లోవచ్చి కూర్చుని వెళ్ళేవారున్నారు. వ్యవసాయపు పనులు ముమ్మరంగావున్న రోజుల్లోతప్ప మిగతా రోజుల్లో ఆచోట అయిదారుగురికి తక్కువ వుండరు.

ఆ పాకకు పదిగజాల దూరంలో వీధిమలుపు తిరగ్గానే మొదటిఇల్లు రామయ్యది. పొట్టిగా, నల్లగా, పీలగా పెరిగిపోయిన దుబ్బుగడ్డంలో యిరుక్కుపోయిన చిన్నమొహంలోంచి ప్రసరిస్తున్న మంచితనంతోవుండే రామయ్య రోజూ మసగల్లోటే లేచి అందరికంటే ముందుగా ఆ పాకలోకి చేరుకుంటాడు. తరువాతనే రెడ్డోరి టెంకాయ తోటలోంచీ పక్షుల కలకలం బయల్దేరుతుంది. కీసరబాసరగా మాట్లాడేసే రామచిలుకలూ, ఛిప్‌ఛిప్‌మంటూ సల్లాపాలు నడిపే పిచ్చికలు ఒక్కసారిగా సందడి ప్రారంభిస్తాయి. ఉండివుండి ఒక్కోసారి శబ్దాన్నీ నిశ్శబ్దాన్నీ కూడా తనలో లయింప చేసుకుంటూ ఒక కోయిల కుహూక్కుహూ మంటుంది. ఆ తర్వాత సూర్యుడితాకిడికి తట్టుకోలేక పరుగెట్టివచ్చిన చీకటి కొండలు అలసిపోయి ఇహ ఒక్క అడుగుకూడా కదలలేమని ఆకాశపుటంచున నిలిచిపోతాయి. తూరుపురేఖలు మైలవిడుస్తాయి. అక్కడ కూర్చుని తత్వాలు పాడుతుంటాడు రామయ్య.

'ఒస్తా ఒట్టిదె పోతా ఒట్టిదె, ఆశ ఎందుకంటా...

పంచభూతములు తోలుబొమ్మతో ప్రపంచమాయెనటా

అంతము వరకూ కించిదాశతో పెంచును జగమంతా
మట్టికుండయిది నమ్మరాదు యీ మర్మమెరుగమంటా

..........................................................

చేసిన ధర్మము చెడని పదార్థము చేరునే నీవెంట'
పాడిందే మళ్ళీ మళ్ళీ పాడుతుంటాడు.

తరువాత నెమ్మదిగా ఒక్కొక్కళ్ళే వచ్చిచేరుతారు. గోష్ఠి ప్రారంభమౌతుంది. శాస్త్రిగారు ఏదయినా పుస్తకం తెచ్చి చదువుతారు. అదయ్యాక కలికాలం, ధర్మం, అధర్మం, నీతి, న్యాయం, ధ్యానం, దొంగసాధువులూ, నిజం జ్ఞానులు... ఎన్నో విషయాలగురించి మాట్లాడుకుంటారు నాగయ్యవచ్చినప్పుడు మాత్రం అంతా తారుమారైపోతుంది. ఎప్పుడైనా తూరుపువేపు చేలల్లో పనివున్నప్పుడే వస్తాడు రెడ్డిగారి తలమనిషి నాగయ్య. వయసులో అక్కడ చేరే వాళ్ళందరిలోకి చిన్నవాడు. ఆవేశంలో పెద్దవాడు. సాధారణంగా దేవుడులేడు అనే విషయాన్ని నిరూపించ ప్రయత్నిస్తూంటాడు.

"ఉండేదాన్ని ఉన్నదని నిరూపించొచ్చునుగాని లేనిదాన్ని లేదు అని ఎట్లాగయ్యా తేల్చేది" అంటారు రామిరెడ్డిగారు.

"వాళ్ళ పొట్టలు నిండించుకోడానికని దేవుడనే పేరుబెట్టి జనాన్ని కట్టిపడేస్తున్నారు. మోసం, అన్యాయం" అంటూ రొప్పుతాడు నాగయ్య.

"ఎవరు ఎవర్ని మోసం చేస్తున్నారని నీకింతబాధ?" అంటూ నిలదీస్తారు శాస్త్రిగారు.

"మీరేనయ్యా. మీ బాపనాళ్ళు. అనాదినుంచీ మామీద సవారీ చేస్తున్నారు. ఈ దగా అంతం కావాలి" అంటాడు నాగయ్య.

"ఎవరు ఎవరిమీద సవారీ చేస్తున్నారో. కృష్ణా రామా అంటూ నాలుగు మంచివిషయాలు మాట్లాడుకుంటే మనశ్శాంతిగా వుంటుందని వచ్చాను. మధ్యన నీసొద ఏమిటి?" అంటూ విసుక్కుంటూ ఆ పూట చదివి ఆస్వాదించను తెచ్చుకున్న పుస్తకం చేతబట్టుకు వెళ్ళిపోతారు శాస్త్రిగారు.

నాగయ్య రానినాడు అందరూ కొంచెం ఎండచురుక్కుమనే వరకూ కూర్చుని తరువాత ఎవరి పనులకు వాళ్లు వెళ్ళిపోతారు. ఒక్కోనాడు రామయ్య వస్తుంటే ఊటుకూరి సుభద్రమ్మ చూసేస్తుంది. మనిషిని చూడగానే ఆమెబుర్ర అమోఘంగా పనిచెయ్యటం ప్రారంభిస్తుంది. ఈ మనిషినెట్లా ఉపయోగించుకోవాలి? ఈ మనిషిచేత ఏ పని చేయించుకోవచ్చును? అని ఆలోచిస్తుంది. సాధారణంగా ఆమె చెప్పినపని ఎవరూ చెయ్యరు. చేసేవాళ్ళు దొరికితే ఆమె వదలదు. సన్నగా పొడుగ్గా తెల్లగావుండే సుభద్రమ్మకు ఘోరమైన మెల్లవున్నది కంట్లో. అందరూ ఆవిణ్ణి 'మెల్లకంటి ముసిల్ది', 'దొంగది' అని వెనకగానూ 'ఊటుకూరోళ్ళ సుభద్రమ్మ' అని ఎదుటనూ అంటూంటారు.

రామయ్య ఉదయాన్నే పూరిపాకకు వెళ్లేటప్పుడు సుభద్రమ్మ పూరిల్లు, ఆ

ప్రక్కనే వున్న ఆమె కొడుకు శంకరయ్యపూరిల్లుదాటి వెళ్లాలి. అత్తాకోడళ్ళ తగవుల్లో వాళ్ళు వేరుబోయి పదేళ్ళవుతున్నది. రామయ్య ఆ దోవన వెళ్తాడని తెలిసిన సుభద్రమ్మ ముందుగానే లేచి కాపలా ప్రారంభిస్తుంది. 'నాలుగ్గడవలు నీళ్లు గొట్టిపెట్టు నాయనా' అనో 'ఈ కట్టెలు రెండు జీల్చిపెట్టు' అనో 'ఇక్కడ తొవ్విపెట్టు' అనో ఏదో ఒకపని చెబుతుంది. ఆ పని పూర్తిచేసేసరికి ఇంకోపని తయారుచేస్తుంది. నవ్వుకుంటూ ఆమెచెప్పిన పనులు చేసిపెట్టి వెళ్తాడు రామయ్య.

ఆ మధ్యన ఒకనాడు రామయ్యకు పురమాయించను ఏపనీ తోచక

"మీతో పాకలో కూచునే అయ్యవారు జాతకాలు జెపుతాడంటగా. నాగ్గూడకాస్త జెప్పమను" అన్నది.

"తలపండిపోయినోళ్లకి మనకెందుకమ్మా అవన్నీ" అన్నాడు రామయ్య.

"మా ముసలిముండాకొడుకుదగ్గర ఇంకా ఎన్నాళ్లు బాధపడాలోనని... నిన్నేం జేశాడో తెలుసా. నడుంయిరిగేట్టు కిందికి తోశాడు. లేస్తేనే కళుక్కుమంటావుంది ఇంకా. వాడి సేతులిరిగిపోను. సేపలొస్తే కొంటానికి డబ్బులుండవు. సేపకొంటే సింతపండు వుండదు. సింతపండు వుంటే వుల్లిపాయ వుండదు. ఎట్టా సచ్చేది. అన్నీ లెక్కలు పిసినారోడికి. ఎదవసచ్చినోడు ఇంకా ఎన్నాళ్లు సంపుతాడో" అన్నది.

ఆమెకీ మొగుడికీ ఎప్పుడూ యుద్ధమే. ఆమెమాటలు పట్టించుకోకుండా

"జాతకాలు సూడాలంటే పుట్టిన టైవూ, నక్షత్రం అన్నీ కావాలంట" అన్నాడు రామయ్య. "అట్టయితే నాది గుర్తులేదుగాని మా సరస్వతి తూరుపు తెల్లారినాక పుట్టింది. శంకరయ్య తొలికోడి  గూసినప్పుడు బుట్టాడు... పోనీ శంకరయ్యన్నా కనుక్కో" అన్నది. అడుగుతాలే అంటూ బయటపడ్డాడు రామయ్య. అప్పటినుండీ రోజూ శంకరయ్య జాతకం గురించి అడుగుతూనే వున్నది సుభద్రమ్మ.

సుభద్రమ్మ ఎవరింటికి వెళ్లినా వాళ్ళు చెంబూ గ్లాసూ దగ్గరనుండి చిట్టుగంపా చీపురుకట్టావరకు ఏమారకుండా కాపలా కాచుకుంటారు. ఇహ మొక్కలసంగతి చెప్పనక్కరలేదు. 'ఈ తీగకు ఒక బీరకాయ ముదిరిపోతుండే. నాకీపూట కూరకి లేదు అదియ్యమ్మా,' 'ఒక కరేపాకు మట్టకావాలి,' 'గెన్నేరు అంటునాటుకున్నట్టుంది. అది నాకిచ్చి ఇంకోటిబెట్టుకో,' ఆ డబ్బా పాతదని అక్కడేశారా... నాకుబని కొస్తది... అందరిదగ్గర వుండే అన్నీ ఆమెక్కావాల్సినవే. ఆమె వెళ్లిపోయాక తను వస్తువు లన్నిటినీ ఒకటికి రెండుసార్లు సరిజూసుకున్నాకనే సిమితపడతారు అవతలివాళ్ళు. ఒకసారి రామయ్యపెళ్ళాంతో మాట్లాడివెళ్లింది సుభద్రమ్మ. ఆమె అటు వెళ్లగానే చెంబుకోసం చూస్తే కనబడలేదు. రామయ్యభార్య పరుగుతోవచ్చి అప్పుడే మూలతిరుగుతున్న సుభద్రమ్మ చేతిలో చీరకొంగు చాటునవున్న చెంబును పట్టుకున్నది.

సుభద్రమ్మ నవ్వి "నామతిమరుపు పాడుగాను. వూరికే నీ చెంబు పట్టుకొస్తున్నానే!" అని ఆశ్చర్యపడిపోయింది. ఇట్లాటివి ఆమె విషయంలో సామాన్యం.

ఆ గుణమే ఆమె కూతురు సరస్వతికి వచ్చింది. శేషయ్యకి ఇవన్నీ గిట్టవు. ఇట్లాంటి విషయం తెలిసినప్పుడు వాళ్లని గొడ్డును బాదినట్టు బాదేస్తాడు. ఆయన ప్రాణాలన్నీ కొడుకు శంకరయ్య మీదనే. శంకరయ్య ముగ్గురు బిడ్డల తండ్రి అయినా యిప్పటికీ నోరెత్తి గట్టిగా మాట్లాడలేని మేదకుడు. సాయంత్రాలు పనిలేనప్పుడు మంచం వాల్చుకుని పిల్లలమధ్యన కూర్చునీ, లేకుంటే తలవాల్చుకుని ఎటో చూస్తూ బయట అరుగుమీదనూ కనిపిస్తాడు తప్ప స్నేహితాలు లేవు శంకరయ్యకు.

శంకరయ్య భార్య వనమ్మ గొప్పింటి పిల్ల. వనమ్మతండ్రి వ్యాపారంలో ఆస్తంతా పోగొట్టుకుని కట్నాలు ఇవ్వలేక వనమ్మను శంకరయ్య కిచ్చిచేశాడు. చాయ నలుపయినా కళగల మొహం వనమ్మది. అత్తవారి పూరిల్లూ, పేదరికం, చెడ్డపేరు ఏదీ వనమ్మకు సరిపడలేదు. మొగుడి మెతకదనం చీకాకు కలిగిస్తుంది. ఎక్కువ డబ్బుగల వాళ్లు తమకు డబ్బులేదని చిన్నచూపు చూస్తారుగనుకనూ, లేనివాళ్ళు తమ అంతస్తుకు తగరుగనుకనూ వనమ్మ చుట్టుపక్కల వారెవ్వరితోనూ మాట్లాడదు. లైబ్రరీనుండి తెచ్చుకున్న పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేస్తుంది. కొడుకుకీ, ఇద్దరు కూతుళ్ళకీ మంచిబుద్ధులూ, పద్ధతులూ నేర్పింది. వాళ్లు ఇరుగింటికీ పొరుగింటికీ వెళ్లి ఆడుకోరు. కష్టపడి చదువుకుంటారు. అబద్ధం ఆడటం, దొంగతనం చెయ్యడం మహాపాపాలనీ, హీనపు పనులనీ వాళ్లకు బాగా తెలుసు. ఆ తాతగారింటి గొప్పతనం , ఈ తాతగారింటి తక్కువతనం వాళ్ళకు పుట్టినప్పుడే అర్థమయ్యాయి... కారణాలెట్లున్నా ఆ ఇంటివాళ్ళకూ మిగతాప్రపంచానికి సంబంధంలేదు.

ఈ వూళ్ళో, యీ కరెంటులేని పూరింట్లో వుంటే పిల్లలకు చదువులు రావనీ, చుట్టూ వుండేవాళ్ళ బుద్ధులు అంటుకపోతాయేమోననీ, పెద్దయ్యాక మంచి సంబంధాలు రావనీ వనమ్మ రెండేళ్ళనుండీ ఇంట్లో పోరుపెట్టినందుకు ఫలితంగా ఈ వూరు ఒదిలేసి నెల్లూర్లో మిద్దెఇల్లు కొనుక్కుని స్థిరపడటానికి ఒప్పుకున్నాడు శంకరయ్య. ఉన్న పొలం యిల్లూ అమ్మాలంటే మరీ తక్కువకు అడుగుతున్నారు. నెల్లూర్లో ఇల్లు బేరం కుదిరింది. బయానా ఇవ్వడానికి డబ్బు కుదరలేదు.

ఊటుకూరి శేషయ్య ఇంటి ప్రక్కనే వాళ్ళన్న సుబ్బరామయ్య ఇల్లు. సుబ్బరామయ్య బియ్యం దొంగతనంగా మెడ్రాసుకు రవాణా చేసి డబ్బూ పలుకుబడీ సంపాదించుకున్నాడు. తమ్ముడి కుటుంబానికంటే ఆర్థికంగా పైస్థాయికి వెళ్ళిపోయాడు. అతని కూతురు ఎక్కడో పేరంటానికి వెళ్లివచ్చి నాలుగు బంగారు గాజులు చేతినుండి తీసి తన ట్రంకుపెట్టెలో వేసిందట. మరునాటి ఉదయం చూస్తే అవి కనిపించలేదు. మాయమై పోయాయి. అవి ఎలా పోయాయో, ఎక్కడున్నాయోగాని అనుమానం వ్యాపించి అనేకమంది మీదికి ప్రసరించి ఆఖరికి డబ్బు అక్కర జాస్తిగా వున్న శంకరయ్య మీద నిలిచింది. శంకరయ్య ఆ రోజు సాయంత్రం పెదనాన్నగారింటికి వెళ్ళాడు...
"గాజులు మర్యాదగా తెచ్చిఇస్తావా, పోలీసురిపోర్టు ఇమ్మన్నావా? నువ్వే తీశావు

గాజులు..." అంటూ నలుగుర్లో నిలేసి నోటికొచ్చినట్లు తిట్టాడు సుబ్బరామయ్య.

తర్వాత శంకరయ్య తలెత్తి నడవలేకపోయాడు. పిల్లల మొఖాలు నేరుగా చూడలేకపోయాడు. వనమ్మతో మాట్లాడ్డం మానేశాడు. అపవాదూ, పోలీసులు పెట్టబోయే చిత్రహింసలూ తలచుకొని తలచుకొని భయపడి భయపడి పోయాడు. నోరు తెరిస్తే ఒణుకువస్తున్నదిగాని మాట బయటకు రావడం లేదు... నాలుగురోజు లిలా వున్నాక అయిదోరోజున ఎండ్రిన్ తాగాడు. బాధనుంచీ, భయంనుంచీ అరగంటలో విముక్తుడయ్యాడు.

కూతురి లెక్కల నోట్సులోనుంచీ తీసిన కాయితంలో కొడుకు పెన్నుతో వ్రాసిన ఉత్తరం చనిపోయిన శంకరయ్య జేబులో వున్నది. 'సత్యప్రమాణంగా ఆ గాజులు నేను తియ్యలేదు. అవమానం భరించలేక ప్రాణం తీసుకుంటున్నాను. నా ఆస్తి నా పిల్లలకు చెందాలి' అని రాశాడు. ఇంతవరకూ శంకరయ్యతో ఒక్క సానుభూతి మాట పలుకనివారు ఇప్పుడు "వాడు గాజులు తియ్యనేలేదు. మెతకవాణ్ణి పట్టుకుని వూరికే బెదిరించి ప్రాణం తీసుకునేట్లు చేశాడు సుబ్బరామయ్య" అన్నారు ఏకగ్రీవంగా. శంకరయ్య మంచితనం, కూలివాళ్ళనుకూడా పల్లెత్తుమాట అనని అతని మెతకదనంగురించి మాట్లాడుకున్నారు. సుబ్బరామయ్యను తిట్టుకున్నారు. లోగడ అతనుచేసిన దుర్మార్గాలన్నీ బయటకు తోడుకున్నారు... వాళ్ల ప్రశంసలతోనూ సానుభూతితోనూ నిమిత్తంలేకుండా శంకరయ్య గాలిలో కలిసిపోయాడు...

రోజుకంటే ముందుగా లేచాడు రామయ్య ఆ రోజున. విశ్వగర్భంలో పేరుకుపోయిన నిశ్శబ్దాన్ని చీలుస్తూ కరుకుగొంతుతో కొక్కొరోకో అంటూ కూత పెట్టింది తొలికోడి. మందపాటి తెల్లటి దుప్పటిని మడతలమీదనే బుజానకప్పుకొని చెప్పులేసుకుని బయల్దేరుతూ "తొలికోడి కూసినప్పుడు పుట్టాడు శంకరయ్య" అనుకున్నాడు. శేషయ్య ఇల్లు చీకటిగా శూన్యంగా వుంది. అది దాటగానే శంకరయ్య ఇంట్లోని హరికేన్ లాంతరు మిణుకు మిణుకుమంటూ కనిపించింది. ఇవాళ్టికి శంకరయ్య పోయి మూడురోజులు. ఇంట్లో కొంచెంకూడా అలికిడిలేదు. ఇంట్లోవున్న శంకరయ్య భార్యాపిల్లలూ, బంధువులూ అందరూ మంచి నిద్రలోవున్నారు. ఏడ్చి ఏడ్చి అలసిపోయి పడిపోయారు... మెలకువ వున్నప్పుడు ఏడ్చిన ఏడుపు, పడిన బాధా మెలకువతోనే వదిలిపోతున్నవి. నిద్రలోకి పోవడంలేదు ఈ కథ. సేదదీర్చి సుఖాన్నిచ్చే గుణమే వున్నది నిద్రకు... వాళ్లందరూ శంకరయ్య లేడన్న నిజాన్ని మరచి నిద్రపోతున్నారు... అయితే అది "నిజం" ఎలాగయింది! మనిషి చూస్తున్న ప్రపంచం "నిజం" కాదా అనుకున్నాడు రామయ్య ఆశ్చర్యంగా. మెలకువలో తోచి, నిద్రలో మాసిపోయేది సత్యం కాలేదు. అంతా ఒక విచిత్రమైన ఆట అనిపించింది రామయ్యకు. వింతపడుతూనే నడిచివెళ్లి పాకలో కూర్చున్నాడు.

"లేవయ్యా లే, ఎప్పుడూ లేనిది ఇవ్వాళ ఇట్లా నిద్రపోతున్నావు?" అంటూ

లేపారు ఎవరో. తడిసిన చేలలోని నీళ్ళు ఉదయిస్తున్న సూర్యుడి వెలుగుపడి రక్తపు మడుగుల్లా మెరిసిపోతున్నాయి.

"మనిషి ప్రాణం ఖరీదు నాలుగు బంగారు గాజులా?....ఈ అన్యాయాన్ని సహించకూడదు....సుబ్బరామయ్య అంతు కనుక్కోవాలి" ఆవేశంగా అంటున్నాడు నాగయ్య. "సుబ్బరామయ్యదేముంది? ఎవరిసొమ్ము వారికి ఎక్కువగానే కనపడుతుంది. అయినా ఎవరో నిందవేశారని ప్రాణం తీసుకుంటారా? నిందలు మీద పడ్డోళ్ళంతా ప్రాణాలు తీసుకుంటున్నారా? వాడి పిరికితనానవాడుపోయాడు" అన్నారు రామిరెడ్డిగారు.

"ఖర్మ తోసుకువచ్చింది. లేకుంటే ఆ అనుమానం ఆ అమాయకుడి మీదికి రావడమేమిటి? వాడికా బుద్ధి పుట్టడమేమిటి?" అన్నారు శాస్త్రిగారు.

అంతా వింటూ నిల్చున్న పాలేరు సుబ్బడు 'ఇంతేనా నీకు తెలిసింది' అన్నట్లు తల విసిరాడు. "నేను అప్పుడే అనుకున్నానండి. శంకరయ్యగారు పోవడానికి మూణ్ణెల్లు ముందరగా కాకులు గుంపులుగా అరుచుకుంటూ వాళ్ళింటి మీద చుట్టూ తిరిగినై... ఇవి అమ్మోరి కాకులుగాదే, మరణకాకులల్లె వుండయ్యే అని అప్పుడే అనుకున్నా" అన్నాడు.

మగత నిద్రలోవున్న రామయ్యకు అంతా ఒక కథలాగా వుంది... ఎన్ని నిజాలుగా వుంది ఒక్క సంఘటన! ఎవరికి తోచింది వారికి నిజం కాబోలు...

నింద అంటే శంకరయ్యకు అంత భయం ఎందుకు? ఎవరో తనని దొంగ అనుకుంటే వచ్చిన బాధ ఏమిటి? దొంగ అన్నమాటలోకి అంతబాధ, బరువూ, ప్రాణం తీసే శక్తీ ఎలా వచ్చాయి?! అనుకున్నాడు రామయ్య... ఆ శక్తి శంకరయ్యకు పుట్టుకనిచ్చిన ప్రపంచంలోనుంచి వచ్చింది. దొంగతనం చేసే తల్లినుంచీ చెల్లెలినుంచీ. దొంగతనం అంటే సరిపడని తండ్రినుంచీ తన వాళ్లను అసహ్యించుకునే పెళ్లాంనుంచీ, దొంగతనం పరమహీనమని నేర్చుకున్న పిల్లలనుంచీ, అందరిలోనుంచీ వచ్చిచేరింది ఆ బరువు. ఆ బరువు మొయ్యలేని అర్భకుడు శంకరయ్య... ఇంతవరకూ అనుకున్నాక ఎన్నో నిజాల్లో ఇదీ మరొక నిజం అనుకుని నవ్వుకున్నాడు... ఇన్ని నిజాల్లోనూ శంకరయ్య లేడు!... నిజానికి శంకరయ్య... శంకరయ్యకు తెలియలేదుగాని అతను చచ్చిపోవాల్సిన అగత్యంలేదు. అతని అర్భకత్వం, జీవితమూ, చావూ, అన్నీ అతను చేసుకున్నవే!... మనిషి అన్ని పరిమితుల్నీ మించినవాడు...

ఆకాశానికీ, భూమికీ నడుమన ఆ పూరిపాకలో కూర్చున్న రామయ్య తాను నల్లగా పీలగావున్న అనామకుణ్ణి అనుకోలేదు. విశాలంగా, ఎంతో విశాలంగా వుండి తన్మయత్వం కలిగిస్తున్న ప్రపంచంతో తాదాత్మ్యం చెంది-

"పంచభూతములు తోలుబొమ్మతో ప్రపంచమాయెనటా" అంటూ పాట మొదలెట్టుకున్నాడు...

★★★